ప్రజాశక్తి

ఆదివారం 16 ఏప్రిల్ 2023
5
శ్రీకాకుళం

రక్తదానంతో ప్రాణదానం

శ్రీకాకుళం : ఒకరు రక్తదానం చేయడం ద్వారా నలుగురికి ప్రాణదానం చేసిన వారవుతారని ఎఎస్‌పి టి.పి విఠలేశ్వరరావు అన్నారు. మానవత్వంతో ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని పెద్దపాడు రోడ్డులో గల పద్మపూజిత ఫౌండేషన్‌లో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో సుమారు వంద మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రక్త నిల్వలు తక్కువగా ఉన్నాయని, రక్తదానానికి యువత ముందుకు రావాలన్నారు. రక్తదానంపై అపోహలు వీడాలన్నారు. పద్మపూజిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బండారు ఫణికుమార్ వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు, విశ్రాంత డిఇఒ బి.మల్లేశ్వరరావు, ట్రాఫిక్ డిఎస్‌పి సిహెచ్.జి.వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లోపాలు తలెత్తనీయొద్దు

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- అప్పగించిన పనులను బాధ్యతతో నిర్వర్తించాలి
- సిఎం పర్యటనను విజయవంతం చేయాలి
- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈనెల 19న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా అన్నిరకాల జాగ్రత్తలు పాటించాలని విద్యాశాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. సిఎం పర్యటనా ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సంతబొమ్మాళి మండలంలోని మూలపేటలో పోర్టుకు శంకుస్థాపన కార్యక్రమం ఈనెల 19న నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్కడే పైలాన్ ఆవిష్కరణ, భూమి పూజ ఉంటాయని అనంతరం మూలపేట రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం ఉంటుందన్నారు. అక్కడ నుంచి బయలుదేరి ముఖ్యమంత్రి నౌపడ చేరుకుంటారని, అక్కడ బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమం ప్రారంభం నుంచి ముగిసే వరకు ఎటువంటి లోపాలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వారికి అప్పగించిన బాధ్యతలను విధిగా నిర్వహించాలని ఆదేశించారు.

వేసవి దృష్ట్యా ప్రతి పాయింట్ వద్ద తాగునీటి సదుపాయం, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బహిరంగసభ చుట్టూ వాటర్ ట్యాంకర్లను ఉంచాలని, వాటర్ ప్యాకెట్లు, వాటర్ డ్రమ్ములు ఉండేలా చూడాలన్నారు. ప్రధాన వేదిక వెలుపల టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా మహిళల కోసం ప్రత్యేక మొబైల్ టాయిలెట్లు ఉంచాలని సూచించారు. 104, 108 వాహనాలు, వైద్య శిబిరాలను ప్రతి ప్రదేశంలో ఏర్పాటు చేయాలన్నారు. ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు దాదాపుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అప్పగించిన పనుల పర్యవేక్షణకు అధికారులను కేటాయించామని తెలిపారు. మూలపేట, నౌపడలో హెలీప్యాడ్‌లు ఏర్పాటు చేశామన్నారు. బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్, వంశధార ఎత్తిపోతల పథకానికి ముఖ్యమంత్రి అక్కడ నుంచే వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

ఎస్‌పి జి.ఆర్ రాధిక మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు 1900 మంది పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బహిరంగ సభ ప్రాంతాన్ని ఐదు సెక్టార్లుగా విభజించి, ప్రతి సెక్టార్ వద్ద పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ప్రత్యేక ఉప కలెక్టర్ జి.జయదేవి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

సిఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 19న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటనకు పటిష్ట బందోబస్తుకు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. సిఎం పర్యటన బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపు, వివిఐపి వాహనాల పార్కింగ్, హెలీప్యాడ్, ప్రోటోకాల్ తదితర అంశాలపై నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం పర్యటనలో భూమి పూజ, సభా వేదిక వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నందున అందుకనుగుణంగా బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. సభా వేదిక, పైలాన్ ఆవిష్కరణ వద్ద అవసరమైన సిబ్బందిని నియమించాలన్నారు. రూట్ బందోబస్తు, పార్కింగ్, సభా వేదిక బందోబస్తును సెక్టార్ల వారీగా ఎఎస్‌పిలు, డిఎస్‌పి స్థాయి ఇన్‌ఛార్జి అధికారుల ఆధ్వర్యాన సిబ్బందిని కేటాయించాలని చెప్పారు.

సభకు హాజరయ్యే ప్రజానీకానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. వివిఐపి వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను కేటాయించి, ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిఐపి కాన్వాయ్ వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా సిబ్బంది నియమించాలన్నారు. కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వర్తించి సిఎం పర్యటనను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ ఎం.ఎన్ మణికంఠ, ఎఎస్‌పి టి.పి విఠలేశ్వరరావు, డిఎస్‌పిలు ఎం.మహేంద్ర, ఎస్.బాలరాజు ఎస్.వాసుదేవరావు డి.ప్రకాశరావు, సిహెచ్.ప్రసాదరావు, జి.శ్రీనివాసరావు సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

కణితి విశ్వనాథం కన్నుమూత


ప్రజాశక్తి - పలాస



విశ్వనాథం మృతదేహం వద్ద రోదిస్తున్న కుమార్తె శారద



నివాళ్లర్పిస్తున్న మంత్రి అప్పలరాజు



కణితి విశ్వనాథం (ఫైల్ ఫొటో)

వైద్యులు, పార్లమెంట్ మాజీ సభ్యుడు, రాజకీయ కురువృద్ధులు కణితి విశ్వనాథం (91) తన నివాసంలో శనివారం కన్నుమూశారు. నందిగాం మండలంలోని హరిదాసుపురంలో 1932 జులై ఒకటో తేదీన కణితి దొంగన్న చౌదరి, జానకమ్మ దంపతులకు రెండో సంతానంగా విశ్వనాథం జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం స్వగ్రామం హరిదాసుపురంలో, హైస్కూల్ విద్యాభ్యాసం మందస, టెక్కలిలో అభ్యసించారు. ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేసి 1957లో వైద్య వృత్తిని ప్రారంభించిన ఆయన మరణించే వరకు వైద్య సేవలందించి ప్రజా వైద్యునిగా పేరొందారు. ఆయన సతీమణి లలిత గతేడాది మృతి చెందారు. ఆయనకు కుమార్తె శారద, కుమారుడు రాజేంద్ర ఉన్నారు. శారద, ఆమె భర్త రాజేష్ ఆస్ట్రేలియాలో వైద్యులుగా పనిచేస్తున్నారు.

రాజకీయ ప్రవేశం

1959లో కాంగ్రెస్ పార్టీలో చేరి క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు ఆశీస్సులతో 1989, 1991 ఎన్నికల్లో రెండుసార్లు శ్రీకాకుళం ఎంపీగా పోటీ చేసి హనుమంతు అప్పయ్యదొర, కింజరాపు ఎర్రన్నాయుడుపై విజయం సాధించారు. రాజీవ్‌గాంధీ ప్రభుత్వంలో 1989లో ఆరోగ్య సంక్షేమ మంత్రిత్వశాఖ కౌన్సిల్ సభ్యులుగా పనిచేశారు. 2011లో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైసిపి కేంద్ర కమిటీ సభ్యునిగా తొలినాళ్లలో పార్టీ బలోపేతానికి జిల్లావ్యాప్తంగా పర్యటించారు. 2014లో జై సమైక్యాంధ్ర పార్టీలో చేరి పలాస ఎమ్మెల్యే అభ్యర్థిగా ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత బిజెపిలో చేరి కోర్ కమిటీ సభ్యులుగా కొనసాగుతున్నారు.

జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర

కణితి విశ్వనాథం జిల్లా అభివృద్ధికి విశేష కృషి చేశారు. ఆయన హయాంలోనే వంశధార రెండో దశ పనులు చేపట్టారు. జిల్లాకు కేంద్రీయ విశ్వవిద్యాలయానికి తీసుకొచ్చారు. జిల్లాలో టెలీ కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. 1990లో భారీ వరదలకు శ్రీకాకుళం నగరం మునిగి అపారనష్టం వాటిల్లడంతో, నాగావళి నదీ తీరంలో రక్షణ గోడలు ఏర్పాటు చేయడం ఆయన కృషి ఫలితమే. తర్వాత ఎన్ని వరదలు సంభవించినా పెనుముప్పు తప్పడానికి ఆ రక్షణ గోడలే కారణం. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వరకు ఉన్న విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను పలాస వరకు పొడిగించడంలో విశేష కృషి చేశారు.

లయన్స్ క్లబ్‌ను స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. 1989లో ప్రయివేటు ఐటిఐని స్థాపించారు. కీ.శే వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో రూ.కోట్ల విలువ గల ఐటిఐ కళాశాలతో పాటు స్థలాన్ని ప్రభుత్వానికి ఉచితంగా అందించారు. డాక్టర్ వి.కణితీస్ ప్రభుత్వ ఐటిఐగా మార్పు చెందిన ఆ సంస్థకు చైర్మన్‌గా కొనసాగుతున్నారు. విద్యార్థుల కోసం తన సొంత స్థలంలో వసతిగృహ నిర్మాణం చేపట్టారు.

పలువురు పరామర్శ

విశ్వనాథం భౌతికకాయాన్ని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, వజ్జ బాబూరావు, దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ శ్రీధర్, కోత పూర్ణచంద్రరావు, డాక్టర్ జీవితేశ్వరరావు, కేశవరావు తదితరులు సందర్శించి నివాళ్లర్పించారు. కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి తదితరులు సంతాపం తెలిపారు.

నేడు అంత్యక్రియలు

విశ్వనాథం అంత్యక్రియలు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్లు అధికార లాంఛనలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు మంత్రి అప్పలరాజు తెలిపారు.

మీరెందుకు నిర్మించలేదు?

- పోర్టు వద్దంటే చరిత్రహీనులుగా మిగులుతారు
- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స
- 'జగనన్నే మా భవిష్యత్'కు విశేష స్పందన
- వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

భావనపాడు పోర్టును టిడిపి తన ఐదేళ్ల కాలంలో ఎందుకు నిర్మించలేకపోయిందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. నగరంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోర్టు నిర్మాణాన్ని పట్టించుకోని టిడిపి నాయకులు ఇప్పుడు బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పోర్టు వద్దంటే చరిత్రహీనులుగా మిగులుతారని వ్యాఖ్యానించారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ విషయంలో వైసిపి, రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ఉన్నాయని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ వద్దని కోరుతూ ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పలుమార్లు కేంద్రానికి నివేదించారని తెలిపారు. నేరడి బ్యారేజీ నిర్మాణం ఆలస్యమవుతుందనే రైతుల ప్రయోజనాల కోసం ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయిస్తుంటే, దానిపైనా అవగాహన లేకుండా చంద్రబాబు మాట్లాడుతున్నారని విమర్శించారు. దశాబ్దాలుగా కుట్రలతోనే అధికారాన్ని సాధించడానికి అలవాటు పడిపోయిన చంద్రబాబుకు రాష్ట్రంలోని అభివృద్ధి, సంక్షేమం కలవరపాటుకు గురిచేస్తున్నాయన్నారు.

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉండడం వల్లే కార్యక్రమం ప్రారంభమైన వారం రోజుల్లోనే విశేష ప్రజాదరణ లభించిందని తెలిపారు.

అభివృద్ధిని జనంలోకి తీసుకెళ్లాలి

అంతకుముందు పార్టీ ముఖ్యులతో ముఖ్యమంత్రి జిల్లా పర్యటనపై నిర్వహించిన సమావేశంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడారు. ఈనెల 19న సిఎం వైఎస్ జగన్ జిల్లాలో రెండు బృహత్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడానికి వస్తున్నారని తెలిపారు. సిఎం పర్యటనని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి జరగలేదని విపక్షాలు ప్రచారం చేస్తున్నాయని, వాటిని పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇచ్ఛాపురంలో దయాలసిస్ యూనిట్ల ఏర్పాటు, పలాసలో కిడ్నీ పరిశోధన కేంద్రం ఏర్పాటు, టెక్కలిలో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనుల పూర్తికి నిధుల కేటాయింపు, గొట్టాబ్యారేజీ వద్ద ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం నిధులు కేటాయించిందని చెప్పారు. ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో పెద్దఎత్తున కార్యకర్తలు తరలి రావాలని కోరారు.

పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ మత్స్యకారుల చిరకాల స్వప్నం భావనపాడు పోర్టు అని, దాన్ని నెరవేర్చడానికి వస్తున్న సిఎం జగన్‌కు ఘనంగా స్వాగతం పలుకుదామన్నారు. భావనపాడు పోర్టు నిర్మాణంతో జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, పార్టీ పరిశీలకులు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై మాక్‌డ్రిల్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా సహాయ అగ్నిమాపకశాఖ అధికారి ఎం.వరప్రసాద్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం పాతబస్టాండ్ వద్ద మాక్‌డ్రిల్ చేపట్టారు. ఆపద కాలంలో, అత్యవసర పరిస్థితుల్లో, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏవిధంగా ప్రతిస్పందించాలి, నివారణ చర్యలు తీసుకునేందుకు తగిన సలహాలు సూచనలు అందించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాగింగ్ రహిత కాలేజ్‌గా 'జెమ్స్'


ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

ర్యాగింగ్ రహిత కాలేజ్‌గా జెమ్స్ వైద్య కళాశాలను తీర్చిదిద్దడం అభినందనీయమని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కె.నాగమణి అన్నారు. మండలంలోని రాగోలులో గల జెమ్స్ వైద్య కళాశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన ర్యాగింగ్ నిషేధ చట్టంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీనియర్లు, జూనియర్లు కలిసిమెలిసి ఉండాలని సూచించారు. ర్యాగింగ్ వంటి అనైతిక చర్యలకు పాల్పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. ర్యాగింగ్ చేస్తే జైలుశిక్ష తప్పదని విద్యార్థులను హెచ్చరించారు. అదనపు సీనియర్ సివిల్‌జడ్జి ఎం.అనురాధ మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకుని భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. కళాశాలలో ఇప్పటివరకు ర్యాగింగ్ కేసులు నమోదు కాకపోవడం సంతోషదాయకమన్నారు. ఆ ఒరవడినే కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీలలిత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇ.సంజీవరావు, పిజి కో-ఆర్డినేటర్ డాక్టర్ వి.రామారావు, హాస్టల్ వార్డెన్లు డాక్టర్ రవికుమార్, నీరజారాణి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



హెచ్చరికా! భరోసా! ఏది నిజం?

రాష్ట్ర రాజకీయాల్లో అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీల్లో రోజురోజుకూ వేడి పుట్టించే మాటలు తూటాల్లా దూసుకొస్తున్నాయి. ముందస్తు ఎన్నికలు ఉండవని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించిన తర్వాత ప్రధాన ప్రతిపక్షం నుంచి ముందస్తు మాట నిలిచిపోయింది. అయినా ఎన్నికలకు సన్నద్ధమయ్యేలా అధికార పక్షం సమావేశాలు, కార్యక్రమాలు జోరందుకున్నాయి. గడప గడపకు కార్యక్రమంలో ఎవరు వెనుకబడినా టిక్కెట్లు ఇచ్చేది లేదని, సర్వేల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని ఇటీవల నిర్వహించిన సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలకు హెచ్చరికలు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో కనీసం ఇద్దరు, ముగ్గురికి టిక్కెట్లు రావన్న ప్రచారం ఆ పార్టీలోనే మొదలైంది. ప్రత్యామ్నాయ అభ్యర్థులుగా కొందరు తెర పైకి వచ్చారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చాయి. వై నాట్ 175 నినాదంతో ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా అహంకార ధోరణితో వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఎమ్మెల్సీ ఫలితాలు పెద్ద షాకే ఇచ్చాయి. ప్రభుత్వ వ్యతిరేక ఎదురుగాలి ఉందని ఫలితాలు వెల్లడించాయి. అనంతరం నిర్వహించిన పార్టీ సమావేశంలో ముఖ్యమంత్రి మదిలో హెచ్చరిక ధోరణి గూడు కట్టింది. అసంతృప్తి సెగలు కక్కుతున్న వారిని ఊరడించేందుకు నేనెవరినీ వదులుకోవడానికి సిద్ధంగా లేనని ఎమ్మెల్యేలకు భరోసా ఇచ్చారు. ఇది మంచిదా? చెడ్డదా? అన్న దాని కంటే ఆయన మాటల్లో చెప్పాలంటే మడమ తిప్పడమే. ఆ భరోసా మాటతో జిల్లాలో తమకు టిక్కెట్లు రావేమోనన్న భయంతో ఆందోళనకు గురవుతున్న వారి మనసు కొంత శాంతించినట్లయింది. హెచ్చరికతోనో, భరోసాతోనే చివరికి ఏది నిజమవుతుందన్న చర్చ మాత్రం పార్టీలో సాగుతున్నట్లు తెలిసింది. అసలు ముఖ్యమంత్రి ఆధారపడుతున్న సర్వేల్లో ఎంత శాస్త్రీయత ఉందన్నది ప్రశ్నార్థకంగానే ఉంటుంది. ప్రభుత్వ ఇంటెలిజెన్స్ నివేదికలతో పాటు ప్రశాంత్ కిశోర్ బృందం సర్వే నివేదికతో పాటు మరో రెండు ప్రయివేటు సర్వే ఏజెన్సీలపై ఆధారపడుతున్నట్లు తెలిసింది. గతంలో చంద్రబాబు అనునిత్యం సర్వేలు నిర్వహిస్తూ ప్రజల్లో ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి శాతం 60 నుంచి 70 వరకు పెరుగుతూ వచ్చిందని మీడియా ముందు చెప్పేవారు. ఫలితాలు మాత్రం ప్రజల్లో అసంతృప్తి శాతం 75 శాతం ఉందని వెల్లడించినట్లయింది. ఈ నేపథ్యంలోనే ప్రశాంత్ కిశోర్ ఆలోచనల్లో భాగంగా జగనన్నే మా భవిష్యత్ అన్న కార్యక్రమం కొత్తగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో రెండు కోట్ల ఇళ్లకు వెళ్లాలని లక్ష్యం. అందులో భాగంగానే జిల్లాలో రెండు లక్షల ఇళ్లకు వెళ్లాల్సి ఉంటుంది. సచివాలయాల పరిధిలో నియమించిన ముగ్గురు సమన్వయకర్తలు, వాలంటీర్ల పరిధిలో ఇద్దరు గృహ సారథుల భుజాలపై ఈ కార్యక్రమాన్ని పెట్టారు. చంద్రబాబు, జగన్మోహన్ రెడ్డి పాలనలోని పథకాలను బేరీజు వేసి జనానికి చెప్పడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా ఉంది. జిల్లాలో మాత్రం ఈ కార్యక్రమం కనీసం పది శాతమైనా కాలేదని పార్టీ నేతలు చెప్తున్నారు. ఇళ్లకు వెళ్లి ఇంట్లో ఉన్న వారితో మిస్డ్ కాల్స్ ఇప్పించాల్సి ఉంటుంది. ఆ ప్రక్రియ కూడా ఆశించినంతగా



జరగడం లేదని తెలిసింది. ఈ కార్యక్రమంలో పార్టీ భాగస్వామ్యం గడప గడపకు మాదిరిగా కనిపించడం లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే కొన్ని ప్రాంతాల్లో వెలవెలబోతుంది. శ్రీకాకుళం నగరంలో ఎన్నికల ముందు కార్పొరేషన్ ఎన్నికలు జరగవని తేలిపోవడంతో కార్పొరేట్ అభ్యర్థులు ముఖ్యంగా ఆశావహులు, సీనియర్లు ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారని తెలిసింది. అసలు జిల్లాలో పార్టీ ఉందా అన్న ప్రశ్న పలువురు పార్టీ సీనియర్లలో వినిపిస్తుంది. ఎందుకంటే ఇప్పుడు జిల్లాకు వైసిపి నాయకుడు ఎవరంటే సమాధానం లేని ప్రశ్నగానే ఉందన్న పార్టీ వర్గాల్లో ఉంది. జిల్లాలో ఎప్పుడు ఏ పార్టీకీ ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదు. ఏ పనులు కావాలన్నా, పదవులు కావాలన్నా, చివరకు పార్టీ టిక్కెట్లు కావాలన్నా జిల్లాలో ఉన్న నాయకులను ఆశ్రయించి తమ ప్రయత్నాలను ప్రారంభించేవారు. ఇప్పుడా పరిస్థితి జిల్లాలో వైసిపిలో లేదు. జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఉన్నా ఆయన మాట చెల్లుబాటు కాదు. పార్టీలో తలెత్తుతున్న వివాదాల పరిష్కారానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ జోక్యం చేసుకోవాల్సి వస్తోంది. జోక్యం చేసుకోవాలని సిఎం ఆదేశాలు ఇవ్వడం చూశాం. అంటే జిల్లా నాయకులు నియోజకవర్గాలకే పరిమితమయ్యే పరిస్థితి ఉంది. పరిపాలనా వికేంద్రీకరణ అన్న నినాదం గట్టిగా వినిపిస్తున్నా, పార్టీలో మాత్రం సంపూర్ణంగా వికేంద్రీకరణ స్థితిలోనే ఉంది. జిల్లాలోని మంత్రులు కూడా రెక్కలు తెగిన పక్షుల్లా విలవిల్లాడుతున్నారు తప్ప బాధను బయటకు చెప్పుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని వారి అనుయాయులే చెప్తున్నారు. పార్టీకి అధ్యక్షులు ఉన్నా సమావేశాలు ఉండవు. ఏళ్లు గడుస్తున్నా అధికారాలన్నీ కేంద్రకృతమయ్యే ఉన్నాయి. ముఖ్యమైన పనులు జిల్లాలో జరగాలన్నా ప్రధాన సలహాదారుల నుంచి గానీ సిఎం కార్యాలయం నుంచి గానీ సందేశాలు, సమాచారాలు రావాలి తప్ప జిల్లా నేతలతో ఏ పనీ జరిగే పరిస్థితి లేదు.

గతంలో చంద్రబాబు జిల్లాలో ప్రచారం చేస్తూ అభ్యర్థులను కాదు నన్ను చూసి ఓటు వేయాలని ప్రచారం చేశారు. నేడు జగన్మోహన్ రెడ్డి కూడా అదే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. పార్టీ కార్యకర్తలతో పాటు ప్రజలతో సంబంధాలు లేకుండా నేతలు దూరమయ్యారు. ఈ మాట ఆ నేతలే చెప్తున్నారు. ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత, అసంతృప్తి బీజాలు మొలకెత్తాయి. ఏ రూపంలో చూసినా జిల్లాలోనూ టిడిపి ప్రత్యామ్నాయంగా కనిపించడం లేదు. పాలనలో, వ్యవహార సరళిలో తోడు దొంగల్లా వ్యవహరిస్తున్న వైనాన్ని చూస్తున్నాం. లౌకిక బలాలతో ప్రత్యామ్నాయ శక్తులు ఎదగడమే ప్రజలకు రక్షణ. అందులో భాగస్వామ్యం కావడమే జిల్లా ప్రజల ముందున్న తక్షణ కర్తవ్యం.

- సత్తారు భాస్కరరావు

ముగిసిన 'పది' పరీక్షలు

ప్రజాశక్తి - టెక్కలి

ఈనెల 3వ తేదీతో ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయి. మారిన పరీక్షా విధానంలో భాగంగా ఆరు పేపర్లకు పరీక్షలు నిర్వహించారు. గతేడాది సైన్స్ పరీక్షను రెండు రోజులు నిర్వహించగా ఈ ఏడాది ఒకే రోజునే నిర్వహించారు. ఈ ఏడాది నుంచి నిమిషం ఆలస్యం నిబంధన పెట్టడంతో పరీక్షా సమయానికి ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. డిబార్లు గానీ, ఇన్విజిలేటర్ల తొలగింపులు గానీ, ప్రశ్నాపత్రాల లీకేజ్ వంటి ఘటనలు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు ముగిశాయి.

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఓపెన్ ఇంటర్, పది పరీక్షలు కూడా శనివారంతో ముగిశాయి. ఈనెల 3వ తేదీన ప్రారంభమైన పరీక్షలు 13 రోజుల పాటు సాగాయి. ఏటా పలు విమర్శలకు దారితీసే ఓపెన్ పరీక్షలను ఈసారి కట్టుదిట్టంగా నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద నియమించిన సిట్టింగ్ స్క్వాడ్‌లు మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం
రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పోలీసు కానిస్టేబుల్ ఎస్.మల్లేశ్వరరావు సతీమణి లలిత కుమారికి రూ.21.15 లక్షల ప్రమాద బీమా చెక్కును ఎస్‌పి జి.ఆర్ రాధిక శనివారం అందజేశారు. మృతుని కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని, ఏ చిన్న సమస్య ఉన్నా నేరుగా సంప్రదించవచ్చని ఎస్‌పి భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌బి జెడి ఎం.ఎన్ మణికంఠ, ఎఆర్‌ఎస్‌పి విఠలేశ్వరరావు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న జడ్జి రవిశంకర్

ప్రజాశక్తి - పలాస
పలాస కోర్టులో మే 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సివిల్ జడ్జి రవిశంకర్ తెలిపారు. కోర్టులో న్యాయవాదులు, పోలీసులతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కలిగించి, లోక్ అదాలత్ విజయవంతం చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, దీర్ఘకాలిక కేసులు, చిన్నచిన్న సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆయన చెప్పారు. సమావేశంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పిండి వెంకటరావు, జాయింట్ కార్యదర్శి జిఎంఎస్ అనిల్‌రాజు, ట్రెజరర్ రవి, న్యాయవాదులు తాండ్ర మురళిమోహన్, కె.రజనికుమార్, బికెఆర్ పట్నాయక్, బి.లక్ష్మి, చిట్టిబాబు, పి.ఎల్.నారాయణ, జగన్నాథం, కాశీబుగ్గ రూరల్ సిఐ శంకరరావు, మందస, సోంపేట, కంచిలి, బారువ ఎస్‌ఐలు రవికుమార్, బాలరాజు, చిరంజీవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనసేన మండల అధ్యక్షుల నియామకం


అనిల్‌కుమార్


రమణ

ప్రజాశక్తి - కోటబొమ్మాళి, పొందూరు
జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాన్ జిల్లాలోని పలు మండలాలకు మండల అధ్యక్షులను నియమించారు. కోటబొమ్మాళి మండల అధ్యక్షునిగా పాగోటి అనిల్‌కుమార్, పొందూరు మండల అధ్యక్షులుగా యలకల రమణను నియమించారు. అనిల్‌కుమార్ 2020లో కోటబొమ్మాళి జెడ్‌పిటిసిగా పోటీ చేశారు. కోవిడ్ సమయంలో గోవా, గుజరాత్‌లో చిక్కుకున్న వారిని జిల్లాకు తీసుకురావడంలో కీలకంగా వ్యవహరించారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పజెప్పిన పవన్‌కళ్యాణ్‌కు, పార్టీ ముఖ్యనాయకులకు రుణపడి ఉంటానని ఆయన అన్నారు. అనిల్‌కుమార్ నియామకంపై జనసేన నాయకులు పల్లి సుధీర్, రాంప్రసాద్, కోటేశ్వరరావు, పవన్, చందు, సంతోష్ శుభాకాంక్షలు తెలియజేశారు.


పొందూరు మండల అధ్యక్షునిగా నియామకమైన రాపాక గ్రామానికి చెందిన యలకల రమణ మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి, ఎన్నికల్లో గెలుపునకు కృషి చేస్తానన్నారు. ఆయన నియామకంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసేన సైనికులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-రణస్థలం
మండలంలోని జె.ఆర్.పురం, రణస్థలం, రావాడ, కొండములగాం, బంటుపల్లి, సంచాం, కమ్మసిగడాం, అర్జునవలస, తదితర పంచాయతీల్లో ఆదివారం ఉదయం 10నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ ఎస్.బయ్యన్నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రణస్థలం 33/11 కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరించడం వంటి పనుల నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గడప గడపకు గొంతు ఎండుతోంది

స్పీకర్‌కు సమస్యలతో స్వాగతం పలికిన లక్కుపురం వాసులు


స్పీకర్ సీతారాంకు సమస్యలను వివరిస్తున్న ప్రజలు

ప్రజాశక్తి - బూర్జ
గడప గడపకు గొంతు ఎండుతోందని, తాగునీటి సమస్యలు ఉన్నాయని పలువురు మహిళలు స్పీకర్ తమ్మినేని దృష్టికి తీసుకొచ్చారు. మండలంలోని లక్కుపురంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా సభాపతి సీతారాం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రతి గడప గడపకు మహిళలు తాగునీటి సమస్యపై విన్నవించారు. గ్రామంలో సుమారు 500 కుటుంబాలు, 1700 మంది ఉన్నామని, 12 తాగునీరు కుళాయిలు ఉండగా, అందులో నాలుగు మూడు నెలలుగా మరమ్మతులకు గురయ్యాయని అన్నారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి 1 గంటన్నర వరకు కుళాయి నీరు ఇస్తున్నారని అన్నారు. సకాలంలో అందరికీ తాగునీరు అందక ఒకరిపై ఒకరు తొక్కిసలాటాడుకొని తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్య ఒకరోజు కాదు, ఒక నెల కాదు.. ఏళ్ల తరబడి ఇదే సమస్యను అనుభవిస్తున్నామని తెలిపారు. రాత్రి, పగలు నిద్రలేక తాగునీరు కోసం తంతాల తప్పటం లేదని ఆ గ్రామానికి చెందిన చిన్ని కళ్యాణి లక్ష్మి, కామమ్మ వాకముడి దుర్గారావు, శ్రీనివాసరావు, బొచ్చ అన్నపూర్ణమ్మ మహిళలు గ్రామస్తులు స్పీకర్ తమ్మినేని సీతారాంను కోరారు. వెంటనే స్పీకర్ స్పందించి ఆముదాలవలస డిఇను సూర్యనారాయణ పిలిపించి నెల రోజుల్లో ప్రతి ఇంటికి తాగునీరు అందే లాంట్యలు తీసుకోవాలని అవసరమైతే కలెక్టర్ దష్టిలో పెడతామని ఆయన డిఈకి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి దివ్య, జెడ్‌పిటిసి రామారావు రాష్ట్ర అవుట్‌సోర్సింగ్ కార్పొరేట్ డైరెక్టర్ గోవిందరావు గుమ్మడి రాంబాబు సర్పంచ్ సంగ అధ్యక్షులు ఉదయ్‌కుమార్ తాసిల్దార్ రమణారావు ఎంపీడీవో రవీందర్ బాబు మండల వ్యవసాయ అధికారి రాజేశ్వరరావు బూర్జటి వైద్య అధికారి పావన సర్పంచులు ఎంసిటిసిలు, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న నరసింహులు

ప్రజాశక్తి - నరసన్నపేట
కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, దేశ సంపదను కారుచౌకగా కార్పొరేట్లకు దోచిపెడుతున్న బిజెపిని రానున్న ఎన్నికల్లో ఓడించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సనపల నరసింహులు పిలుపునిచ్చారు. శనివారం నరసన్నపేట మండలం బజారువీధి, ఆదివారంపేటలో ప్రచార భేరి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, విదేశాల్లో దాచుకున్న నల్లధనం వెలికితీసి ప్రతీ పేదవాడి అకౌంటులో రూ.15 లక్షలు డిపాజిట్ చేస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చిన మోడీ తొమ్మిదేళ్ల పాలనలో ఘోరంగా విఫలమయ్యారని అన్నారు. మోడీ పాలనలో లక్షన్నర కోట్ల నుండి 12 లక్షల కోట్లకు అదానీ ఆదాయం పెరిగిందని ఆరోపించారు. కార్మిక చట్టాలను సవరించి, కార్మికులను కట్టుబానిసలుగా మార్చే కుట్రకు మోడీ ప్రభుత్వం పూనుకుందని అన్నారు. వ్యవసాయ చట్టాలను సవరించి పంట పండించే హక్కు, ధరలు నియంత్రించే హక్కు, మార్కెట్ సౌకర్యం రైతులకు లేకుండా చేసి అదానీ, అంబానీలకు అప్పగించాలని చూస్తోందన్నారు. ఉన్న పరిశ్రమలు మూసి వేసి కోట్లాది మంది కార్మికుల కుటుంబాలను మోడీ ప్రభుత్వం బజారున పడేసిందని అన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ రైల్వేజోన్, విశాఖ స్టీల్ ప్రైయివేటీకరణ అంశాలపై మోడీ ప్రభుత్వాన్ని వైసిపి నిలదీయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, ఎన్.కృష్ణమూర్తి, నాయకులు ఎన్.మధు, ఎన్.నారాయణ, కాంతారావు, రాము, శివ, రాజు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని గొట్టిపల్లిలో శనివారం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ ఆధ్వర్యాన ప్రచార భేరి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నిమ్మక అప్పన్న, గణపతి, గోపయ్య, రమేష్, ధర్మారావు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సౌకర్యం కల్పించాలి

ఎమ్మెల్యేకు రైతుల మొర


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న కృష్ణదాస్

జలుమూరు: జోణంకి పంచాయతీకి సాగునీటి సౌకర్యం కల్పించాలని సర్పంచ్ గురుబెల్లి రమణితో పాటు పలువురు రైతులు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను కోరారు. శనివారం జోణంకి పంచాయతీ గంగాధరపేటలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనను కలిసిన రైతులు పంచాయతీలో అధిక శాతం మంది వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారని, గతంలో రామకృష్ణాపురం ఎత్తిపోతల పథకం ద్వారా మా పంచాయతీకి సాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నప్పటికీ ఏళ్లు గడుస్తున్న నేటికీ సాగునీరు రాలేదని వాపోయారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించినపుడు పలువురు రైతులు సాగునీరు కావాలని అడిగారని, ఇప్పటికే ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి, అంచనాలు వేసి ఇవ్వాలని కోరామన్నారు. మరో ఏడాదిలోగా మీ పంచాయతీకి సాగునీరు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ముందుగా కణితి విశ్వనాథ మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, వైసిపి మండల కన్వీనర్ కనుసు సీతారాం, అల్లాడ, చల్లవానిపేట పిఎసిఎస్ అధ్యక్షులు పొన్నాన ముసలినాయుడు, పాగోటి రాజప్పలనాయుడు, సీనియర్ నాయకులు మొజ్జాడ శ్యామలరావు, ధర్మాన జగన్ మోహన్‌రావు, పైడి విఠల్‌రావు, తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ జి.వి.రవికుమార్, ఎడిఎ రవీంద్రభారతి, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


జూనియర్ సివిల్ జడ్జి మణి

బూర్జ: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్క విద్యార్థీ చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జ్ ఎస్.మణి అన్నారు శనివారం కొల్లివలస బాలయోగి గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో చదువుతోపాటు చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి గ్రంథాలయాల్లో మంచి పుస్తకాలను చదివి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఆమెతో పాటు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయలక్ష్మి, అన్నంనాయుడు, చిన్ననాయుడు, అచ్చంనాయుడు, రాజేశ్వరి, రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ సకాలంలో అందించాలి

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- పౌరసరఫరాల గోదాము ప్రారంభం


గోదామును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజాశక్తి - లావేరు
రేషన్ కార్డుదారులందరికీ సక్రమంగా రేషన్ సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ జెసి ఎం.నవీన్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ జయంతికి సూచించారు మండల కేంద్రంలో రూ.70 లక్షలతో వెయ్యి టన్నుల సామర్థ్యంతో నిర్మించిన పౌరసరఫరాల గోదాంను ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడప గడపకు తిరుగుతున్నప్పుడు చాలామంది కార్డుదారులు మాకు ఈ నెల రేషన్ సరుకులు ఇవ్వలేదని ఫిర్యాదు చేస్తున్నారని, అటువంటి ఫిర్యాదులు రాకుండా అందరికీ సరుకులు అందించాలని అన్నారు. ఇక్కడ గోదాం రావడం వల్ల కళాసీలకు ఉపాధి ఏర్పడిందని, దీన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. జయంతి మాట్లాడుతూ జిల్లాలో ప్రతినెలా 10,500 మెట్రిక్ టన్నుల బియ్యం జిల్లాలోని 6.40 లక్షల మంది కార్డుదారులకు అందిస్తున్నట్లు చెప్పారు. అందరికీ రేషన్ అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెసి ఎం.నవీన్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ దమయంతి, మండల ప్రత్యేక ఆహ్వానితులు ఆర్.బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, రాజనాయుడు, తిరుపతిరావు, డిటి మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మాజీ ఎంపిటిసి గురువులు రెడ్డి మృతి

రణస్థలం రూరల్: మండలంలోని చిల్లపేట రాజాం మాజీ ఎంపిటిసి సభ్యులు ఆళ్ల గురువులు రెడ్డి అనారోగ్యం మృతి చెందారు. ఇటీవల ఆరోగ్యం బాగోకపోవడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి విషమించి శనివారం మృతి చెందారు. ఈయన పొందూరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్‌గా, హరిచంద్ర పాత్రధారి, మంచి కళాకారునిగా, రాజకీయ పార్టీల్లో పలు పదవులు చేపట్టారు. ఆయన భార్య ఆళ్ల పార్వతీదేవి ఎంపిటిసిగా ఉన్నారు.

సంబరాల ఆడియో ఆవిష్కరణ


ఆడియోను ఆవిష్కరిస్తున్న సిఐ

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం
శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఆధ్వర్యాన శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి 'జాతరో జాతర-2023 సంబరాలు ఆడియో పాటలను సిఐ ఈశ్వర్‌చంద్ర ప్రసాద్, ఎస్‌ఐ గోవిందరావు ఆలయ ప్రాంగణంలో శనివారం ఆవిష్కరించారు. ఈ పాటలను వెంకటేశ్వర పట్నాయక్(చిన్నా గురుస్వామి) రచించి, గానం చేశారు. మరికొన్ని పాటలను నీలాపు మనీషా, కొత్త లావణ్యలు ఆలాపించారు. సంగీత సహకారం హేమంత్ కుమార్, బాడిత్య చిన్నా నిత్యానంద్, బాడిత్య మోహన్ అందించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ క్లబ్‌ను వినియోగించుకోవాలి

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో మూడో శనివారం ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ క్లబ్‌ను విద్యార్థులు వినియోగించుకోవాలని గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో జాతీయ నాయకుల పుస్తకాలు, బాల సాహిత్యం, చందమామ కథల పుస్తకాలు చదివించారు. కార్యక్రమంలో లిటిల్ స్కూల్ కరస్పాండెంట్ బి.నీలిమ, ప్రిన్సిపాల్ టి.బాలరాజు, గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, పాఠకులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -నౌపడ
భావనపాడు పోర్టు శంకుస్థాపన కోసం మూలపేట వస్తున్న ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కోరారు. సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మూలపేట, విష్ణుచక్రం, నౌపడలో 19న ముఖ్యమంత్రి పర్యటిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంత వాసుల ఎన్నో ఏళ్ల పోర్టు కల నెరవేరుతుందన్నారు. అందరం కలిపి జగన్మోహన్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలకాలని కోరారు. కార్యక్రమంలో టెక్కలి, సంతబొమ్మాళి జెడ్‌పిటిసిలు దువ్వాడ వాణి, పాల వసంతరెడ్డి, ఎంపిపి మెరుగు రాజేశ్వరి, పిఎసిఎస్ చైర్మన్ పెల్లి జగన్నాయకులు, వైసిపి నాయకులు నక్క భీమారావు, పి.రామకృష్ణ, కోత సతీష్, మేరుగు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సైరిగాం పిహెచ్‌సి తనిఖీ


టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీతులసి

ప్రజాశక్తి - జలుమూరు
మండలంలోని సైరిగాం పిహెచ్‌సిని డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ లక్ష్మీ తులసి శనివారం తనిఖీ చేశారు. టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాల విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లల సంఖ్యను బట్టి నిర్దేశించిన టీకాల డోసులను మాత్రమే తీసుకురావాలని సూచించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలోనూ గర్భిణులకు ఐరన్ మాత్రలు ఇచ్చేలా నిల్వలు ఉంచాలన్నారు. అనంతరం తిమడాం హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో జరుగుతున్న సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్, వైద్యాధికారి కొర్ను వైష్ణవి, ఇఒ బిఎం.నాయుడు, ఎఎన్‌ఎం రంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

మెళియాపుట్టి: మండల కేంద్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న జాడిపల్లి గ్రామానికి చెందిన పి.బాలకృష్ణను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రాజేష్ శనివారం తెలిపారు. మెళియాపుట్టి మద్యం షాప్ నుండి స్టెర్లింగ్ రిజర్వ్ 2 బాటిల్స్, 8పిఎం 5 బాటిల్స్ కొని, అక్రమంగా తరలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం


భైరయ్య

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం
జిల్లాలోని వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. ఇచ్ఛాపురం మండలం బెల్లుపడ జాతీయ రహదారి వద్ద ద్విచక్ర వాహనదారుడిని కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బెల్లుపడకు చెందిన తిప్పన భైరయ్య(33) నెల్లేరులో వెల్డింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాల్లో భాగంగా స్వగ్రామం వచ్చాడు. శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఈదుపురం వెళ్లారు. తిరిగి స్వగ్రామం వస్తుండగా బెల్లుపడ వద్ద పలాస నుంచి బరంపురం వెళ్తున్న కారు ఢీకొంది. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ గోవిందరావు ఘటనా స్థలిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి తల్లిదండ్రులు, తమ్ముడు ఉన్నారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి..

జలుమూరు: మండలంలోని రావిపాడు సమీపంలోని మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి సాగి దాలప్పడు(78) మృతి చెందాడు. ఈయన నరసన్నపేటలో రక్త పరీక్షలు చేయించుకునేందుకు రావిపాడు నుండి తన కుమారుడు సాగి శ్రీనుతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తరువాత ఇంటికి తిరిగి వస్తుండగా రావిపాడు సమీపంలోని మలుపు వద్దకు అతివేగంగా రావడంతో వాహనం అదుపు తప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో దాలప్పడుకు తలకు బలమైన గాయం కావడంతో 108లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి ఆయన మృతి చెందాడు. శ్రీనుకి కూడా గాయాలు అయ్యాయి. ఎస్‌ఐ పారినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

లావేరు: జాతీయ రహదారి రావివలస సమీపంలో శుక్రవారం రాత్రి 11గంటల సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మడతీలా రవీంద్రన్ పిల్లా(52) గాయపడ్డాడు. ఆయనను విశాఖ కెజిహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. కోనసీమ జిల్లా ద్రాక్షారామానికి చెందిన మడతీలా రవీంద్రన్ పిల్లా కుటుంబ సభ్యులకు పని నిమిత్తం వెళ్తున్నామని వారం రోజుల క్రితం ఇంటినుంచి బయలుదేరాడు. శ్రీకాకుళం నుంచి రణస్థలం వైపు నడుచుకుంటు రహదారి వెంబడి వస్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు స్పందించి 108 వాహనానికి సమాచారం అందించారు. శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ తరలించారు. మృతుని భార్య ఏడాది కిందట మృతిచ ఎందారు. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న వ్యక్తి మతి చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. రోడ్డు ప్రమాదంపై ఎఎస్‌ఐ భుజంగరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొట్లాటలో వ్యక్తి మృతి


సింహాద్రి మృతదేహం

ఆమదాలవలస/సరుబుజ్జిలి: సరుబుజ్జిలి మండలం మూలసవలాపురం గ్రామానికి చెందిన కరాపాటి సింహాద్రి(55) కొట్లాటలో గాయపడి మృతి చెందాడు. శుక్రవారం రాత్రి కరాపాటి సింహాద్రి మామిడి తోట కాపలాకు వెళ్లాడు. ఇంటికి వస్తూ మద్యం తాగాడు. సమీప బంధువులు కుప్పిలి భాస్కరరావు, రాజేశ్వరి, లక్ష్మి ఎందుకు ఇలా తిరుగుతున్నావని అడిగారు. దీంతో వారి మధ్య మాటామాటా పెరిగి కొట్లాటకు దారితీసింది. సింహాద్రిని కర్రలు, చేతులతో ఇష్టానుసారం కొట్టడంతో సింహాద్రి అక్కడక్కడ కింద పడిపోవడంతో వెంటనే కుటుంబ సభ్యులు 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుని భార్య అప్పలనర్సమ్మ పోలీసులకు చేసిన ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. సిఐ పైడయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నత స్థానంలో నిలవాలి

మంత్రి ధర్మాన ప్రసాదరావు


విద్యార్థులను అభినందిస్తున్న ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం
ప్రతి విద్యార్థీ ఉన్నత స్థానంలో నిలవాలని రాష్ట్ర మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఐఎన్‌టిఎస్‌ఒ (ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్)లో మహాలక్ష్మినగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, ప్రత్యేక బహుమతులు గెలుపొందారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన అభినందన సభలో పాల్గొన్న మంత్రి తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంకా బాగా చదివి, పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చాలని అన్నారు. ప్రిన్సిపాల్ ఆర్.రాంప్రసాద్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఎస్.రోహిత్, ఆర్.గాయత్రి, సృజన, భావన, రామకీర్తిలకు ధర్మాన బహుమతులు అందజేశారు. అనంతరం ఉత్తరాంధ్ర జిల్లాల ఎజిఎం ఎమ్.వి.సురేష్ గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల కో-ఆర్డినేటర్ ఎ.బాలరాజు, శ్రీ చైతన్య పాఠశాలల రీజియన్ ఇన్‌చార్జి ఎస్.రామినాయుడు, జోనల్ అకడమిక్ డీన్ పి.మోహన్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ జె.ఇంద్రమౌళి, పాఠశాల అకడమిక్ డీన్ ఎ.హరి ప్రసాద్, ఐకాన్ బ్యాచ్ ఇన్‌చార్జి బి.జనార్ధన్, ఎస్.లక్ష్మీకాంత్, ఎస్ బ్యాచ్ ఇన్‌ఛార్జి బి.ప్రసాద్, ఎం.బ్యాచ్,. తదితరులు పాల్గొన్నారు.

అధికారం కోసం అడ్డదారులు

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్


పొందూరు: పోస్టర్‌ను అందిస్తున్న రవికుమార్

ప్రజాశక్తి - పొందూరు
టిడిపి అధినేత చంద్రబాబునాయుడును నేరుగా ఢీకొట్టలేక ఎలాగైనా అధికారం చేపట్టేలనే కాంక్షతో సానుభూతి కోసం కుట్రలు పన్ని 2019లో అడ్డదారులలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గెలుపొందారని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఆరోపించారు. మొదలవలస గ్రామంలో ఎంపిటిసి మొదలవలస సీతారామారావు, మాజీ సర్పంచ్ మొదలవలస ధనలక్ష్మిల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి'లో ఆయన మాట్లాడుతూ కోడికత్తి డ్రామా, బాబాయి గొడ్డలిపోటు హత్యను టిడిపి పైకి నెట్టి సానుభూతితోనే గెలుపొందారన్న విషయం ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు తెలిసిపోయిందని అన్నారు. ఈ రెండు కేసులలో వాస్తవ విషయాలు రాష్ట్ర ప్రజలకు అర్థమైందని, రానున్న ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. జగన్ అనుభవరాహిత్యంతో రాష్ట్రం అప్పులపాలైందని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, దుర్గార్గాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అన్నెపు రాము, చింతాడ కృష్ణవాసుదేవరావు, బలగ శంకర భాస్కరరావు, మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి, బి.సత్యం, సువ్వారి మధు, గోవిందరావు, వరదరాజులు, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం ప్రజల్ని దగా చేస్తూ పాలన చేస్తుందని టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు అన్నారు. ఇదేమి ఖర్మలో భాగంగా శనివారం అయోధ్యాపురం పంచాయతీ గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలతోపాటు ప్రజా అవసరాల ధరలు కూడా పెరగడం వల్ల సామాన్య మధ్యతరగతి కుటుంబీకుల పరిస్థితి దారుణంగా మారిందని అన్నారు. అనంతరం ఇంటింటికి వైసిపి ప్రభుత్వ వైఫల్యాల కరపత్రాలని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల దేశం పార్టీ నాయకులు మామిడి రాము, పోలాకి షణ్ముఖరావు, హనుమంతు రామకష్ణ,, మెండ దమయంతి, కోళ్ల లవకుమార్ రేయ్యి ప్రీతిష్, దల్లి ప్రసాద్ రెడ్డి, మల్లిపెద్ది మధు , కోళ్ల కామేష్ ,గండి చంద్రరావు ,జీరు వెంకటరెడ్డి ,తదితరులు పాల్గొన్నారు ,ఫోటో రైట్ అప్ ఇంటింటికి కరపత్రం పంచుతున్న నాయకులు.

నందిగాం: మండలంలోని బెజ్జిపల్లి పంచాయతీ సింగపురం మజ్జి గోపాలపురం గ్రామాలలో టిడిపి నాయకుల ఆధ్వర్యంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామమంతా కలియతిరిగి రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎం.బాలకృష్ణ, పి.చంద్రశేఖరరావు, మహేష్ గుజ్జు తాతయ్య, జానకిరామ్, సింహాద్రినాయుడు, ఢిల్లేశ్వరరావు, కవిటి, తదితరులు పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

400 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - పర్లాకిమిడి
గజపతి జిల్లా కాశీనగర్ సీయాలి పంచాయతీ వాకరాడా కూడలి నుండి ఖండవ వెళ్లే మార్గంలో మహేంద్ర వానుతో పాటు 400 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు కాశీనగర్ ఐఐసి సుశాంత్ సాహు తెలిపారు. ఐఐసి సుశాంత్ సాహు ఇచ్చిన సమాచారం ప్రకారం వాకారాడ రోడ్ నుండి ఖండవ వెళ్లే మార్గంలో అనుమానాస్పదంగా వెళ్తున్న మహీంద్రా వానులో 400 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. డ్రైవరు, నేరస్తులు పరారీ అయ్యినట్లు చెప్పారు.

పాఠశాల స్థలం కబ్జాకు యత్నం


కూల్చేసిన పాఠశాల ప్రహరీ

ప్రజాశక్తి - ఆమదాలవలస
పురపాలక సంఘంలోని కృష్ణాపురం మెయిన్ రోడ్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాల ప్రహరీను గురువారం సాయంత్రం అదే వార్డుకు చెందిన కొందరు అధికార పార్టీ కార్యకర్తలు కూల్చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతంలో ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడుకు ఆంజనేయ విగ్రహం ఏర్పాటుకు పాఠశాల ఆవరణలో స్థలాన్ని మంజూరు చేయాలని వినతిపత్రం ఇచ్చినట్లు తెలిసింది. అక్కడ స్థలం మంజూరు చేయడం కుదరదని ఆయన వారికి బదులిచ్చారని సమాచారం. అయితే నియోజకవర్గ నేతకు చెప్పి గురువారం పాఠశాల ప్రహరీ, వంటశాలను కూల్చేశారు. అక్కడున్న బావిని కప్పేశారు. ఆ నీటిని తాగి జీవిస్తున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా పాఠశాల, ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా జిల్లా ఉన్నతాధికారులు చూడాలని స్థానికులు కోరుతున్నారు. తాము ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్ తెలిపారు. ప్రహరీని కూల్చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మంత్రి, చైర్మన్ మధ్య విబేధాలకు తెర

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర మత్స్య, పశుసంవర్థకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మధ్య విబేధాలకు తెరపడినట్లు తెలిసింది. ఇటీవల వీరి మధ్య విబేధాలు రావడంతో ఎడ మొహం, పెడ మొహంగా ఉంటూ వచ్చారు. ఇటీవల జరిగిన ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాలకు మున్సిపల్ చైర్మన్ హాజరుకాకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. వీరిద్దరి మధ్య సయోధ్య కుదిర్చేందుకు అనేక మంది తీవ్ర ప్రయత్నాలు చేసినా సఫలం కాలేదు. శనివారం మంత్రి అప్పలరాజు స్వయంగా చైర్మన్ బల్ల గిరిబాబు ఇంటికి వెళ్లి రాజకీయంగా అరగంట పాటు చర్చలు జరిపారు. దీంతో వీరిద్దరి మధ్య ఉన్న


మంత్రితో బల్ల గిరిబాబు

విబేధాలకు తెర పడిందని పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలకపాన్పు ఎక్కిన గిరిబాబును మంత్రి బుజ్జగించారు. పార్టీ పటిష్టత కోసం మున్సిపాలిటీలో పాలనను పారదర్శకంగా అందించేందుకు కలిపి పని చేస్తామంటూ మంత్రి గిరిబాబును కోరినట్లు తెలిసింది. మున్సిపల్ పాలనలో పలువురు అధికార పార్టీ నేతలు జోక్యం చేసుకొని తనకు విలువనీడ లేకుండా చేయడంతో చైర్మన్ బల్ల గిరిబాబు మంత్రికి దూరంగా ఉంటూ వచ్చారు. పార్టీలో కనీస పదవులు లేని నేతల మాటలకు విలువ ఇచ్చి తనను మంత్రి పట్టించుకోకపోవడంతో చైర్మన్ మనస్థాపానికి గురై, ఆయనకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. మున్సిపాలిటీలో ముదురుతున్న రాజకీయాలను పరిశీలించిన మంత్రి కొంతమంది సూచనలతో చైర్మన్‌ను నేరుగా కలిసి సమస్యలపై చర్చించడంతో ఆయన మంత్రి వెంట అడుగుల వేయడానికి సిద్ధమైనట్లు తెలిసింది.

తాగునీరు ఇవ్వడం చేతకాదు

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - బూర్జ

ఈ ప్రభుత్వానికి సాగునీరే కాదు తాగునీరు ఇవ్వడం కూడా చేతకాని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాలను రవికుమార్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి దేశాయ్ ఛానల్, ఓనిగడ్డ, బొమ్మిక మినీ రిజర్వాయర్, నారాయణపురం కుడి, ఎడమ కాలువలు ఏళ్ల తరబడి పూడికపోయాయన్నారు. జంగిల్ క్లియరెన్స్ చేయలేదన్నారు. ఖరీఫ్‌లో వర్షాలు కురుస్తున్నసమయంలో పిల్ల కాలువల ద్వారా నీరు వెళ్తేంటే పక్కనే జెసిబిలు పెట్టి, ఫొటోలు దిగి బిల్లులు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం లక్కుపురం, వైపర్త రైతులతో దేశాయ్ ఛానల్ పరిశీలించారు పాపమ్మ కుటుంబాన్ని, తోటవాడ పైల అప్పారావు, శంకరరావు, శ్రీను కుటుంబాలను పరామర్శించారు లాభం గ్రామంలో బగాది కుటుంబాన్ని పరామర్శించారు వారితో పాటు టిడిపి మం డల అధ్యక్షులు వి.సీతారాంబాబు, లంక జగన్నాథంనాయుడు, అప్పలనాయుడు, జి.ప్రసాద్, జి.నవీన్, గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు ఎమ్మెల్యే పరామర్శ

లావేరు: శ్రీకాకుళం తహశీల్దార్ నిడిగంట్ల వెంకటరావును ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ శనివారం పరామర్శించారు. ఆయన తల్లి దుర్గమ్మ, భార్య పద్మజ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. ప్రముఖ డాక్టర్ దానేటి శ్రీధర్ వెంకటరావును పరామర్శించారు. వారితో పాటు మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, దేశెట్టి తిరుపతిరావు, డి.రాజినాయుడు, ఎల్.శ్రీను, మీసాల శ్రీను ఉన్నారు.

'కణితి' మృతికి పలువురు సంతాపం

టెక్కలి: మాజీ ఎంపీ కణితి విశ్వనాథం మృతికి పలువురు సంతాపం తెలిపారు. నిజాయతీగల నాయకుడు కన్నుమూశారని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కిల్లి రామ్మోహనరావు అన్నారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో సత్తారు సత్యం, టి.బి.జె.గుప్త, పినకాన దేవానందం, పొట్నూరు ఆనందరావు, పేడాడ పరమేశ్వరరావు, కోత మధుసూదనరావు, బిఎస్‌జెఆర్ విద్యాసంస్థల అధినేత కోత మురళీధర్, సుదర్శన థియేటర్ ^జమాని సత్తారు వెంకటరమణ, జివి.రెడ్డి, పీరుపల్లి విశ్వేశ్వరరావు, తదితరుల ఉన్నారు.

కోటబొమ్మాళి: విశ్వనాథం మృతికి ఎంపిపి ఉమా మల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి డి.వెంకటరావు, ఎ.రామారావు, కె.రామరాజు, మురళి, టిడిపి నాయులకు బి.రమేష్, తదితరులు సంతాపం తెలిపారు.

మెళియాపుట్టి: విశ్వనాథం మృతికి మాజీ ఎమ్మెల్యే ధర్మాన నారాయణరావు, బిజెపి నాయకులు సలాన రాఘవరావు, వి.రమేష్ సంతాపం తెలిపారు.

ఘనంగా సాయి విద్యానికేతన్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం


నృత్యం చేస్తున్న చిన్నారులు

మండలంలోని లొద్దపుట్టి గ్రామంలో శ్రీ సాయి విద్యానికేతన్ 21వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. పాఠశాల కరస్పాండెంట్ పళ్లంటి చిరంజీవి అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథులుగా గ్రామ పెద్దలు పాల్గొన్నారు. విద్యార్థుల్లో విద్యపై మాత్రమే కాకుండా, వారిపై దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలన్నారు. ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలని చెప్పారు. కరస్పాండెంట్ చిరంజీవి మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి కె.హేమలత, హెచ్‌ఎం భూపతి, ఉపాధ్యాయులు భవాని, సంతోష్, చాందిని, సౌందర్య, సీత, జ్యోతి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అగ్నిమాపక విన్యాసాలు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని బస్టాండ్ కూడలి వద్ద ఫైర్ ఆఫీసర్ కె.ప్రశాంత్‌కుమార్ అధ్వర్యంలో నిర్వహించిన అగ్నిమాపక విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ద్రవ పదార్థాలు మండిన సమయంలో నివారణకు వాడే ఫోమ్, నీటి విన్యాసాలు ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. అంతకు ముందు జ్ఞాన భారతి విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులతో పట్టణ పుర వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ కె.సూర్యారావు, విద్యా సంస్థలు కార్యదర్శి జోహార్ ఖాన్, అగ్నిమాపక సిబ్బంది కామరాజు, కాశీ విశ్వనాథ్, ప్రసాద్, బీమారావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: ఆయిల్, ఎలక్ట్రికల్ ఫైర్ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రణస్థలం అగ్నిమాపక అధికారి పైలా అశోక్ తెలిపారు. శనివారం స్థానిక సూర్య స్కూల్ జంక్షన్, రామాంజనేయ థియేటర్ వద్ద అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు అగ్నిప్రమాదాలపై ప్రతి నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయిల్, ఎలక్ట్రికల్ ఫైర్ సమయంలో తీసుకోవాల్సిన నివారణ చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శనివారం అగ్నిమాపక అధికారి జి.రమణమూర్తి అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మహిళలు వంట చేసేటప్పుడు


కొత్తూరు: అగ్నిమాపక విన్యాసాలు చేస్తున్న సిబ్బంది

అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

పలాస: అగ్నిప్రమాదాలపై అవగాహన అవసరమని ఎస్ఐ సోమేశ్వరరావు అన్నారు. పలాస రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాస్కరరావు, యుగంధర్, ప్రేమ్‌కుమార్, మన్మథరావు, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: కొత్తపేట కూడలి, కోటబొమ్మాళతి మెయిన్‌రోడ్డుపై అగ్నిమాపక సిబ్బంది చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా అగ్నిమాపక అధికారి బూచోడు మాట్లాడుతూ గ్యాస్, విద్యుత్, తదితర వస్తువులు ఐఎస్ఐ మార్కు ఉన్నవే వినియోగించాలని అన్నారు. మండే స్వభావం ఉన్న వస్తువులు ఇంట్లో ఉంచకూడదని అన్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రం పంపణీ చేశారు. కార్యక్రమంలోఅగ్నిమాపక సిబ్బంది కె.విశ్వనాథం, పిఆర్.రెడ్డి, ఎం.ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షపై శిక్షణ

ప్రజాశక్తి - బూర్జ

మండలంలోని తోటవాడ పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో మండలం, గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ తరగతులు భాగంగా వ్యవసాయ సహాయ సంచాలకులు బి.రాజగోపాల్‌రావు ఆధ్వర్యంలో మండల స్థాయి భూసార పరీక్ష శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 16 రైతు భరోసా కేంద్రంలో ఒక్కొక్క రైతు భరోసా కేంద్రం నుంచి సుమారు 1000 నమూనాలు తీసుకొని ఆమదాలవలసలో లేబొరేటరీకి పంపి భూ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. రైతుకి తక్కువ ఖర్చుతో అధిక లాభం పొందవచ్చన్నారు. ఆయనతోపాటు మండల వ్యవసాయ అధికారి వి.రాజేశ్వరరావు, గుమ్మడి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కృష్ణారావు

రాజీనామాకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి -మెళియాపుట్టి

ఆదివాసీ ప్రజాప్రతినిధులు అంతా రాజీనామాకు సిద్ధం కావాలని ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరాహల కృష్ణారావు, ఆదివాసీ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు సవర చొక్కారావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. 2014, 2019 ఎన్నికల్లో ఆదివాసిలంతా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపిస్తే ఆదివాసీల గుండెల్లో గుణపం దించిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. ఎపి అసెంబ్లీలో బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ తీర్మానం చేశారని అన్నారు. ఆదివాసీలంతా ఏకమై దీనికి వ్యతిరేకంగా ఉద్యమించాలని, ఆదివాసీ రిజర్వేషన్‌తో గెలుపొందిన ప్రజా ప్రతినిధులు మూకుమ్మడిగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌టి కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబు, ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

అందరికీ 'ఉపాధి' కల్పించాలి

ప్రజాశక్తి - మెళియాపుట్టి

జాబ్ కార్డు ఉన్న వారందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎపిడి మురళీకృష్ణ సిబ్బందికి స్పష్టం చేశారు. శనివారం పెద్ద లక్ష్మీపురంలో అమత్ సరోవర్ చెరువు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు రెండు పూటలా పనిచేయాలని, సగటు వేతనం రూ.250కు తగ్గకుండా ఉండాలన్నారు. వంద రోజులు పని దినాలు కల్పనపై దృష్టి సారించాలని అన్నారు. లక్ష్యసాధనలో వెనుకబడిన సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.ఉదయ్‌కుమార్, ఇసి ఆదినారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ తవిటినాయుడు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎపిడి మురళీకృష్ణ

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రజలకు ఏ సమస్య ఉన్నా చెప్పండి.. పరిష్కరిస్తామని పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని చీమలవలస గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పనితీరుపై ప్రతి ఒక్కరూ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. సంక్షేమ పథకాల అమల్లో దేశానికే రోల్ మోడల్‌గా ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్నారు. ఎవరికి ఏ సమస్య ఉన్నా సచివాలయ కన్వీనర్, వాలంటీర్ల దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్స్ గురుగుబెల్లి హేమలత, బొడ్డేపల్లి నీలయ్య, దవల విమల, శేఖర్, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలో శనివారం మా నమ్మకం నువ్వే జగన్ నిర్వహించారు. ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, వైస్ ఎంపిపి కర్రి గోపయ్య ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ విధివిధానాలు, అమలు చేస్తున్న పథకాలు వివరించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకు జగన్ స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో సర్పంచులు ఎస్‌పి నారాయణ స్వామి, బద్రి ప్రకాష్, పిఎసిఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, ఎస్‌పి ప్రవీణ్, గృహ సారథులు పాల్గొన్నారు.

టెక్కలి: జగన్ ప్రజారంజకమైన పాలన వల్లే ప్రజా భవిష్యత్, జీవితం ఆధారపడి ఉందని ఎంపిపి అట్ల సరోజనమ్మ అన్నారు. మండలంలోని పరశురాంపురం పంచాయతీలో జగనన్నే మా భవిష్యత్ నిర్వహించారు.


చీమలవలసలో కరపత్రం పంచుతున్న శ్రీనివాసరావు

ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందిన తీరును అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ కె.కామేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్‌లు గుజ్జు మోహన్‌రెడ్డి, పొందర శ్రీనివాస్, మక్క శంకరరావు, సిగిలిపల్లి శ్యామలరావు, ఆట్ల రవి, గండి అప్పలరెడ్డి, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.